క్లుప్తంగా

నేడు కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ మంగళవారం తెలిపారు. రూ.65 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం శంకుస్థాపనలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారని చెప్పారు.

లంక భూముల పట్టాల పంపిణీ వాయిదా

మోపిదేవి: లంకభూముల పట్టాల పంపిణీ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు లంక భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం జరగాల్సి ఉంది. అనివార్య కారణాల వల్ల పట్టాల పంపిణీ కార్యక్రమం వాయిదా పడిందని, ఎప్పుడు జరిగేది తరువాత ప్రకటిస్తామని తహసీల్దార్ వివరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: జయశాలి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని దేవునితోట యానాదుల కాలనీలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు దుప్పట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తే దేవునికి సేవ చేసినట్లే అవుతుందని అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ గాదెల్లి డేవిడ్‌శామ్యూల్, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్ నోబుల్, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, నిర్వాహకులు పి. జీవన్‌బాబు, కె. ఆమోస్, ఎం. భాస్కరకుమార్, పాల్గొన్నారు.

అలరించిన పురాణ శ్రవణం

మచిలీపట్నంటౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం, కృష్ణాజిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో కార్తిక మాసం సందర్భంగా నగరంలోని ఈడేపల్లి జోడుగుళ్ల వద్ద మంగళవారం నిర్వహించిన పురాణ శ్రవణ ఫలం కార్యక్రమం భక్తులను అలరించింది. కార్తికమాసం–స్నాన, దీపారాధన అంశాలపై బ్రహ్మశ్రీ మండలీక కృష్ణకుమార్ పురాణ శ్రవణం ఫలాన్ని నిర్వహించారు. టీటీడీ ప్రతినిధి తురగ ప్రసాద్, ఆలయ ఈఓ తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు, సేవా సమితి ప్రతినిధి ఎ. శాస్త్రి పర్యవేక్షించారు.

ఓటరు నమోదుపై ప్రచారం

గూడూరు: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బి. విజయ్‌ప్రసాద్ కోరారు. మండలంలోని ప్రధాన కూడళ్లలో ఓటర్లను చైతన్యపరుస్తూ మంగళవారం హోర్డింగులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గూడూరు మండలంలో ఓటు హక్కు ఆవశ్యకతపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఓటు హక్కు కోసం అర్హులైన వారు తమ ప్రాంత బీఎల్‌ఓలను సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

తైక్వాండోలో విద్యార్థి ప్రతిభ

రామానగరం(చల్లపల్లి): రాష్ట్ర స్థాయి తైక్వాండో ఆంధ్రప్రదేశ్ 41వ సబ్ జూనియర్ ఆరో క్యాడెట్ అండర్ 12–14 విభాగం చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థి ప్రతిభ చూపాడని ప్రిన్సిపాల్ డి.సురేష్ మంగళవారం తెలిపారు. తెనాలి జేఎంజే మహిళా కళాశాలలో జరిగిన పోటీల్లో చైతన్య విద్యార్థి యార్లగడ్డ ధనసాయి సిల్వర్ మెడల్ సాధించాడని తెలిపారు. ధనసాయిని ప్రిన్సిపాల్ సురేష్, ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ, రీజనల్ ఇంచార్జి జె.రాజేష్‌బాబు, ప్రిన్సిపాల్ సురేష్ అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ కేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే పేదలకు మేలు

- అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అమలు
- మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్న ప్రజలు
- ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాలు

పెడన: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలతోపాటు అన్నివర్గాలకు మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలు పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో మంగళవారం జరిగాయి. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రభుత్వానికి, వైఎస్సార్ జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడాను, ఆయా ప్రభుత్వాల్లో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే తమకు పథకాలు అందాయని, అన్నివర్గాలకు మేలు జరిగిందని ప్రజలు సంతోషం వ్యక్తంచేశారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకున్నారు. పెడన 8వ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం మంగళవారం సాయంత్రం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సంక్షేమ ఫలాలు ఎటువంటి దళారులు లేకుండా నేరుగా అర్హులకు అందుతాయన్నారు. మీరంతా జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం సచివాలయం పరిధిలో 20, 21వ వార్డులలో సంక్షేమ బోర్డులను ఆవిష్కరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు, కొసనం కరుణకుమారి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

- పెడన మండలంలోని కొప్పెల్లి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులతో కలిసి పార్టీ నాయకులు సంక్షేమ బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి గడప గడపకు సంక్షేమ పథకాలను వివరించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాదరావు, సచివాలయాల సమన్వయకర్త బెజవాడ నాగబాబు, నాయకులు పాల్గొన్నారు.



పెడనలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

- **పెదప్రోలు(మోపిదేవి):** పేదల జీవన విధానం మారాలంటే జగనన్నే మరోసారి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు అన్నారు. పెదకళ్లేపల్లి సచివాలయం వద్ద పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రామంలో ఇంటింటా లబ్ధిదారులకు అందిన పథకాలను బుక్‌లెట్ ద్వారా చదివి వినిపించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్లు అరజా లక్ష్మీతులసీ, ఆది రాంబాబు, నోడల్ అధికారి విద్యాసాగర్, గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, మండల సచివాలయ కన్వీనర్ శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



బందరులో మాట్లాడుతున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

- **సంగమేశ్వరం(నాగాయలంక):** సంగమేశ్వరం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమాలు జరిగాయి. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, డీసీఎంఎస్ డైరెక్టర్ రేమాల సుబ్బారావు (బెనర్జీ), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు సంక్షేమ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచి నాయుడు నాగమల్లేశ్వరి, ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తోట సాయిబాబు, ఎంపీటీసీ సభ్యులు విశ్వనాథపల్లి వెంకటరమణ, మోకా నాగప్రసాద్, మద్ది కొండలు, భోగాది రాధాకృష్ణ నాయకులు పాల్గొన్నారు.



సంగమేశ్వరంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

- **గూడూరు:** ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని గూడూరు మండలం రాయవరంలో నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఎంపీపీ సంగా మధుసూదనరావు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల అధ్యక్షుడు వర్ధం పెదబాబు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ, రవి, కోళ్ల నాంచారయ్య పాల్గొన్నారు.
- **కృత్తివెన్ను:** చినగొల్లపాలెం సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని నాయకులు వివరించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బాపూజీ, సర్పంచ్ సునీల్, లక్ష్మీపురం పీఏసీఎస్ చైర్మన్ నరసింహస్వామి, మైనారిటీ మహిళా నాయకురాలు షహనాజ్ బేగం, నాయకులు సాల్మన్, బాలాజీ, సూరిబాబు, నాగబాబు, దాసు పాల్గొన్నారు.
- **కోడూరు:** ఉల్లిపాలెం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకోవాలని కోరారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. రాత్రికి పల్లె నిద్ర చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి సత్యనారాయణ, సర్పంచి వి. పావని, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



రాయవరంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ

జగన్ పథకాలతో ప్రజల్లో నమ్మకం..

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం కనిపిస్తోందని వక్కలగడ్డ సర్పంచ్ వల్లూరు ఉమా అన్నారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రకటించి అమలు చేయని మేనిఫెస్టో, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్ అమలు చేసిన మేనిఫెస్టోను ప్రజలకు చూపించి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, ఫుడ్ కమిటీ డైరెక్టర్ కుందేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

- **అవనిగడ్డ:** మోదుమూడిలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ గ్రామంలో పార్టీ జెండా ఎగురవేశారు. సంక్షేమ బోర్డును ఎంపీపీ, జెడ్పీటీసీ ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి చంద్రబాబు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలను ప్రజలకు వివరించి అభిప్రాయాలు సేకరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల నాయకులు షేక్ నజీర్‌బాషా, రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- ఘంటసాల మండలం కొడాలి సచివాలయం పరిధిలో జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావు వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఎంపీటీసీ కొండేటి నీలవేణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పరుచూరి రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

మచిలీపట్నంటౌన్: దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్ సంక్షేమ సారథిగా పేరొందారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 3, 19, 5 డివిజన్లలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఆయా డివిజన్లలో సంక్షేమ బోర్డులను, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. అన్నివర్గాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు సీఎం కృషి చేస్తున్నారని వివరించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ జగన్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల అనుమతితో జెండాలను కొట్టారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, మేకల సుబ్బన్న, కాగిత జవహర్‌లాల్, కార్పొరేటర్లు వేముల గాందీ, మీర్ అస్గర్‌అలీ, పర్ణం సతీష్, షేక్ ముంతాజ్‌బేగం, పరింకాయల విజయ్, రాసంశెట్టి వాణిశ్రీ, పడమట రేవతి, నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

నాగాయలంక: మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. తీరప్రాంతంలో మత్స్యకారుల సంక్షేమానికి, మత్స్య సంపద పెంపుదలకు, ఆక్వారంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రపంచ మత్స్య దినోత్సవం మత్స్యశాఖ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ ఫుడ్‌కోర్టు భవనంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే నాగాయలంకలో తొలిగా నల్లజల్ల చేపల సీడ్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో 11 ఫిష్ లాండింగ్ సెంటర్లు ఉన్నాయని, 1,889 మత్స్యకార పింఛన్ ఇస్తున్నామని, 1,182 ఇంజిన్ బోట్‌లకు అయిదేళ్లుగా మొత్తం 23,712మంది లబ్ధిదారులకు రూ.2,370.50 లక్షలు మత్స్యకార భరోసా అందించామని చెప్పారు. మోటరైజ్డ్ నావలకు గత ప్రభుత్వం లీటరుకు రూ.6.03 సబ్సిడీ ఇవ్వగా తమ ప్రభుత్వం రూ.9 సబ్సిడీతో నెలకు 300 లీటర్లు ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లో నేరుగా ఆయిల్ తీసుకునేలాగా ఏర్పాటు చేశామని తెలిపారు. చేపలవేట నిషేధకాలంలో రూ.4 వేలు ఉన్న భృతిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద ఏకంగా రూ.10 వేలకు పెంచి అందిస్తోందన్నారు. మత్స్యశాఖ జేడీ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో 18,279.43 ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతోందని, అవనిగడ్డలోని ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్ ద్వారా రైతులకు అవసరమైన 1,745 టెస్టులు చేశామని వివరించారు.



మత్స్యకార లబ్ధిదారులకు మోపెడ్‌లను అందించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

నాగాయలంక మండలంలోని 151 మత్స్య మిత్ర గ్రూపులకు ఒక్కో గ్రూపునకు రూ.2 లక్షల చొప్పున రుణాలు అందించామన్నారు. తొలుత నాగాయలంకలో లబ్ధిదారు టి.రోజిలిన్‌కు పీఎంఎంఎస్‌వై కింద మంజూరైన రూ.10 లక్షల యూనిట్ ఫిష్ ఆంధ్రా డైలీ షాపును ఫెర్రీరోడ్ కరకట్ట డౌన్‌లో ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించారు. అనంతరం నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన 11 మంది మత్స్యకార లబ్ధిదారులకు సబ్సిడీపై ఐస్ బాక్స్, బయోఫ్లోక్‌లతో కూడిన మోపెడ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, అవనిగడ్డ మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, స్థానిక ఎఫ్‌డీఓ సునీత, సచివాలయాల ఫిషరీస్ అసిస్టెంట్స్, తీర గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై అవగాహన కల్పించాలి

- రైతుల సందేహాలను నివృత్తి చేయాలి
- తహసీల్దార్ మధుసూదనరావు

పెడన: ధాన్యం కొనుగోళ్లపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తహసీల్దార్ పి. మధుసూదనరావు అన్నారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. ఈ విషయంలో వీఏఏలు ప్రధాన భూమిక పోషించాలని చెప్పారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా రైతుల ఆమోదంతో చేయాలన్నారు. రైతుల సమక్షంలోనే ధాన్యం శాంపిల్స్‌ను సేకరించి పకడ్బందీగా విశ్లేషణ చేసి తేమ శాతం, తప్ప, తాలు నిర్ణయించి తెలియజేయాలన్నారు. టెక్నికల్ సిబ్బంది పొరపాట్లకు తావులేకుండా ఉన్నది ఉన్నట్లుగా లెక్కలు కట్టి రైతులకు వివరించాలని సూచించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆయా వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరిచి అప్‌డేట్ చేస్తుండాలన్నారు. ఏఓ జీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ యాప్‌పై పూర్తి పట్టుండాలని, రైతులు ధాన్యం తరలింపు విషయంలో వారి సొంత గోనె సంచులను, రవాణా వాహనాలను వినియోగిస్తుంటే ఆ వివరాల నమోదులో పొరపాట్లకు తావీయ వద్దన్నారు. వాస్తవంగా ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల ద్వారా ధాన్యం తరలిస్తామని, అందుకు రైతుల అంగీకారంతోనే ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ కె. పూర్ణచంద్రరావు, వీపీఏలు, టీఏలు, ఎంపీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదనరావు

ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టవద్దు

బందరు ఆర్డీఓ వాణి

గూడూరు: ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం అమ్ముకునే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని బందరు ఆర్డీఓ ఎం.వాణి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రామరాజుపాలెం రైతు భరోసా కేంద్రాన్ని బందరు ఆర్డీఓ ఎం.వాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్బీకే ద్వారా ధాన్యం కొనుగోళ్లలో అవలంబిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 440 బస్తాల ధాన్యం కొనుగోలు చేశామని వీఏఏ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ పనిచేయని పరిస్థితిలో ఆఫ్‌లైన్ ద్వారా ప్రక్రియ కొనసాగించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. తహసీల్దార్ జి.విజయప్రసాద్, మండల వ్యవసాయ శాఖాధికారి జీవీ శివప్రసాద్, సహకార అధికారి విజయ్‌కుమార్, పీఏసీఎస్ సీఈఓ ఎల్‌వీఏ చక్రవర్తి, వీఆర్‌ఓ కోన అంజిబాబు పాల్గొన్నారు.

లింగాకారంలో దీపారాధన

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో లింగాకారంలో దీపారాధన నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో పలువురు మహిళలు లింగాకారంలో ముగ్గులు వేసి అందులో దీపాలు వెలిగించారు.

వర్షంతో అన్నదాతల ఆందోళన

కోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. వేకువజామున 4 గంటలకు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ప్రారంభమైంది. మధ్యాహ్నం 3 గంటల వరకు కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాలైన మాచవరం, వి.కొత్తపాలెం, జయపురం, కోడూరు గ్రామాల్లో వరిపంట కోత దశకు రాగా, దిగువ ప్రాంతాలైన ఉల్లిపాలెం, దింటిమెరక, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, మందపాకల ప్రాంతాల్లో పంట ఈనిక దశలో ఉంది. ప్రస్తుతం వర్షం కురవడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం రోజుల్లో వరికోతలు ప్రారంభమయ్యేవని, వర్షానికి ఈదురు గాలులు కూడా తోడవడంతో పంట నేల వాలిందని వాపోతున్నారు. తీరప్రాంత గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేస్తుండగా, ఈ వర్షం ఆ పొలాలకు మేలు చేసింది.

- **కృత్తివెన్ను:** ఆకాశం మేఘావృతమై చిన్నపాటి చినుకులు రాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కృత్తివెన్ను మండలంలో ఈ ఖరీఫ్‌లో సుమారు 7 వేల ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. ప్రస్తుతం చాలావరకు పొలాలలో పంట చేతికి వచ్చేందుకు సిద్ధంగా ఉంది. చెరుకుమిల్లి, యండపల్లి, మునిపెడతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు వరికోతలు కోశారు. ఈ సమయంలో వర్షం కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తిచేసిన వారు పంట నూర్పిళ్లు పూర్తి చేసి ధాన్యాన్ని నిల్వ చేసుకుంటున్నారు.



కోడూరులో ఈదురు గాలులు, వర్షానికి నేల వాలిన వరిపొలం

మెప్మా బజార్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మంగళవారం ప్రారంభించారు. నగరంలోని పలు డ్వాక్రా సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువుల అమ్మకాల స్టాళ్లను ఆమె సందర్శించారు. స్టాళ్ల వద్ద వస్తువుల అమ్మకాలు చేశారు.

ఆక్వాలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ

భావదేవరపల్లి(నాగాయలంక): ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆక్వా రైతులకు చేపలు–రొయ్యల చెరువుల్లో చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులపై స్థానిక ఎంవీకేరావు ఫిషరీస్ కళాశాలలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుల నిర్మాణం, విత్తన ఎంపిక, మేత యాజమాన్యం తదితర అంశాలను మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ జె.యశ్వంత్ కుమార్ రైతులకు వివరించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖరరావు మాట్లాడుతూ రొయ్య పిల్లల ఎంపిక, ప్రో బయోటిక్స్, మినరల్స్ వాడకం, నీటి నాణ్యతా ప్రమాణాలను వివరించారు. అనంతరం ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదుగురు మత్స్యకార రైతులను సన్మానించారు. కేవీకే శాస్త్రవేత్తలు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్ర కుటుంబానికి సాయం

అవనిగడ్డ: దివంగత జర్నలిస్ట్ కళ్లేపల్లి చంద్ర కుటుంబానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జైగోపాల్ రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. అవనిగడ్డ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ విరాళాన్ని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావు, సభ్యులు దీవి సారంగపాణి అయ్యంగార్ ద్వారా అందజేశారు. గాజుల పోతురాజు ఫ్రెండ్స్ సర్కిల్ ద్వారా రూ.10 వేలు, ఆర్ అండ్‌బీ డీఈ వరలక్ష్మి రూ.10 వేలు, ప్రభుత్వ అధికారి శ్రీనివాసరావు రూ.10 వేలు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా రూ.2 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు కోట యూరీగగారిన్, కోట సుబ్బారావు, చందు శ్రీనివాసరావు, జేఎస్ శాస్త్రి పాల్గొన్నారు.


జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు జెడ్పీ విద్యార్థిని ఎంపిక

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని లోకం లహరి జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థిని లహరి, వ్యాయామ ఉపాధ్యాయుడు మారుతి అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లోనూ లహరి సత్తా చాటి గోగినేనిపాలెం హైస్కూల్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారంలోగా సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ఆవరణలో సుందరీకరణ పనులు వారం రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్, మంగినపూడిబీచ్, కలెక్టర్ బంగ్లా సుందరీకరణ పనులపై రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను ఆయన పరిశీలించి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్, డీఆర్డీఏ కార్యాలయం వద్ద స్లోప్ ఎలివేషన్ పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. ఈవీఎం గోడౌన్ వద్ద ఐమాస్ట్ విద్యుత్ దీపాన్ని ఏర్పాటు చేయాలని, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని, ప్రతి కార్యాలయానికి రహదారి చూపాలని తదితర సూచనలు చేశారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో ఐమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టర్ బంగ్లా ప్రాంగణాన్ని ఒక అడుగు మేర ఎత్తు చేసి చక్కని ప్లాంటేషన్ అభివృద్ధి చేయాలన్నారు. పూలమొక్కలతో ప్లాంటేషన్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. వచ్చే వారం ఈ పనులను పరిశీలిస్తానని, పురోగతి లేని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. డీఆర్వో పెద్ది రోజా, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీఓ నాగేశ్వర నాయక్, కమిషనర్ చంద్రయ్య, ఆర్డీఓ ఎం. వాణి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఎస్‌బీఐ రీజనల్ బిజినెస్ కార్యాలయం ప్రారంభం

మచిలీపట్నంటౌన్: స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ రీజనల్ బిజినెస్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఇకపై మచిలీపట్నంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్దే రీజనల్ బిజినెస్ కార్యాలయం సేవలు అందిస్తుంది. ఈ కార్యాలయాన్ని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్‌చంద్రజా, డెప్యూటీ జనరల్ మేనేజర్లు మణీష్‌కుమార్‌సింగ్, కృష్ణకుమార్ బి. ప్రభు రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.